తీసుకోవాలి. ఇతరులకు మనమీద గౌరవభావం కలగాలి. ఈ రోజుల్లో విద్యార్థినులు పావడ మీద అరగజం వోణీముక్క ధరించిరావటం ప్యాషను అయింది. ఈ ఓణీ ఎందుకు వేసుకుంటున్నారో అర్థంకాదు. ఇట్లా తయారై స్కూళ్ళకు, కాలేజీలకు వెళుతూన్న ఆడపిల్లల్ని చూస్తూ ఆ తల్లి తండ్రులు, ముఖ్యంగా తల్లులు ఎట్లా ఊరు కుంటున్నారా అనిపిస్తుంది. ఆడపిల్లల వస్త్రా లంకరణ విషయంలో తల్లులు తగిన జాగ్రత్త తీసుకోవడం మంచిది.

తన కుమార్తె ఎలాంటి దుస్తులు ఎలా ధరించి వెడుతుందో తల్లి పర్యవేక్షించడం ఎంతో అవసరం. అలా అని ఆ పర్యవేక్షణ కూడా అతిగా వుండకూడదు. అతిగా పోతూ పిల్లల సున్నితమైన మనస్సులను నొప్పించకూడదు. ఒక్కొక్కసారి మితిమీరిన పర్యవేక్షణ పిల్లల్ని పాడు చేస్తుంది కూడా. దుస్తులను ఎలా ధరించితే బాగుంటుందో, మర్యాదగా వుంటుందో వారికి నేర్పించాలి. ఈ విషయంలో మొగట తల్లులే పిల్లలకు మార్గ దర్శకులు కావాలి. కాన్వెంటు విద్యార్థినులు ఆదర్శంగా కనబడతారు. ఎవరెవరి అంతస్తులు ఎలాటివయినా, అభిరుచులు ఎలా ఉన్నా అంతా ఒకటే యూనిఫారం ధరించడం వలన ఏ ఆకర్షణకూ లొంగిపోకుండా, తమ లక్ష్యం మీద దృష్టి ఉంచడానికి వీలవుతుంది. విద్యార్థినులంతా విపరీతంగా తయారవుతున్నారని నా ఉద్దేశ్యం కాదు. ఎంత ఉన్నతమైన చదువులో ఉన్నా, ఎంతో నిరాడంబరంగా, సామాన్యంగా కనిపించే ఆదర్శ విద్యార్థినులు ఎంతో మంది ఉన్నారు.

ఏ వేళప్పుడు ఎలాంటి దుస్తులు వేసుకుని ఎలా తయారయితే బాగుంటుందో మనల్నీ, మన పరిసరాల్నీ, మనసులో పెట్టుకుని మనకున్న విచక్షణా జ్ఞానం ఉపయోగించుకొని, నిర్ణయించుకోవడం మంచిది.

□

# పొరపాటు

నేనూ కథ వ్రాశాను. నా కెంతో తృప్తిగా వుంది. వ్రాసినది పదేపదే చదువుకున్నాను. బాగానే వుంది నామట్టుకు. యిది పత్రికలో పడాలి. అన్నయ్య గర్వం అణగాలి. పెద్ద....గొప్ప....తనకే కథలు వ్రాయటం వచ్చని గర్వం. ఏ పత్రిక నుంచైనా మనియార్డరు వస్తే ఎంత మురిసి పోతాడని! సరదాకైనా ఎప్పుడూ నా చేతిలో కాని, తమ్ముడి చేతిలో కాని ఒక అయిదు రూపాయలు పెట్టి ఎరగడు. నేను అలా కాదు. నా మొదటి కథ అచ్చయితే యింట్లో అందరికీ నాకు తోచిన ప్రజెంటేషన్లు కొంటాను. ఫ్రెండ్సుకి 'పార్టీ' యిస్తాను యింతకీ ఈ కథ పోస్టు చెయ్యటమెలా ? నాలో నాకే నవ్వు వచ్చింది. కథ చేతిలో పట్టుకునే కలలు కంటున్నాను. అవును. ఈ కథ పోస్టు చెయ్యటమెలా ? యింట్లో ఎవ్వరూ లేరు. అమ్మ వూరికెళ్ళింది. అవతల పనిమనిషి అంట్లు తోముతూంది. యిటూ అటూ కాలుగాలిన పిల్లిలా తిరిగాను. నేను రాసిన మొదటి కథ వెంటనే పోస్టు చెయ్యకపోతే ఎంతో చికాగ్గా వుంది. "అక్కా అన్నం పెట్టవూ ? స్కూలుకి వెళ్ళిపోవాలి...." తమ్ముడు వచ్చాడు. "ఒరేయ్ చిన్నా....నాకో చిన్న పని చేసిపెడతావురా ?" మెల్లిగా అడిగాను, అన్నం పెడుతూ. "ఓ...." తల ఎగరవేశాడు. "తలెగరెయ్యటం కాదు. నేను చెప్పినట్లు జాగ్రత్తగా చెయ్యాలి. అంతేకాదు. యింట్లో ఎవ్వరికీ....ముఖ్యంగా అన్నయ్యకి – చెప్పకూడదు." ఒక్క నిమిషం నా వైపు అయోమయంగా చూసి, "సరే...." అన్నట్లుగా తల ఎగరవేశాడు తమ్ముడు. అన్నం తిన్న తర్వాత నా కథ వాడి చేతిలో పెట్టాను. యింకొక కాగితం మీద అడ్రసూ అదీ వ్రాసి యిచ్చి, ఎలా పోస్టు చెయ్యాలో వివరంగా చెప్పాను. "నాకు తెలుసులే అక్కా. ఎలా పోస్టు చెయ్యాలో....! అన్నయ్య కవర్లు ఎన్నిసార్లు పోస్టు చెయ్యలేదు?" విసుక్కుంటూ వెళ్ళాడు వాడు.

కథ పోస్టుకి పంపించిన దగ్గరనుండి భయం పట్టుకుంది. బాగుందో లేదో ? వేసుకుంటారో లేదో? మళ్ళీ ఒకసారి చదవవలసింది. పోని అన్నయ్యకైనా చూపెట్టవలసింది. ఎంతైనా వాడికి కథలు వ్రాయటంలో అనుభవం వుంది కదా....పోనీ పత్రికలో వేసుకున్నారనుకుందాము. పాఠకులకు నచ్చొద్దూ.... 'ఛీ....చెత్తలాగుంది....' అని ఉత్తరాలొస్తే ? ఏమైనా...అట్నుంచి రిప్లై రావటానికి కనీసం నెల్లాళ్ళు పడుతుంది. యిప్పటినుండి ఈ ఆలోచనలన్నీ ఎందుకు ?

*

"పోస్టు..." కేక.

నా కథ వ్రాసి పంపి యింకా మూడు రోజులే అయింది. అప్పుడే ఏం తెలుస్తుంది ?....అనుకుని కూర్చున్నాను.

అన్నయ్య వెళ్ళి కవరు తెచ్చాడు. ఆ కవర్ని చూచిన అన్నయ్య ఎంత ఆశ్చర్యపోతున్నాడో నాకూ అంత ఆశ్చర్యంగానే వుంది.

అప్పుడే ఎలా తిరిగి వచ్చేసింది ?

"ఓహో....నువ్వు కథ పంపించేవూ పత్రికకు? మీ రచయిత్రులు ఎక్కువైపోవటంతో మగ వాళ్ళ కథలేం కన్పించటం లేదీ మధ్య .. యింతకీ....తిరిగి వచ్చిందిలే....అయితే యిది ఎన్నోది....?" అది [illegible] ఎగతాళో తెలియదు. కవరు విప్పి యిటూ అటూ చూచి ...యిల్లదిరిపోయేట్టు నవ్వాడు.

"ఏం? ఏమయింది?" అన్నాను అసహనంగా.

"ఇది తమ్ములుంగారికిచ్చావా పోస్టు చెయ్యమని ? బాగా చేశాడులే. పత్రికల వాళ్ళకు వెళ్ళవలసిన కవరు లోన పెట్టేసి, రిటర్న్ స్టాంప్స్ అంటించినది పోస్టు చేశాడు. ఇది పత్రికాఫీసు చేరనే లేదు."

పత్రిక వాళ్ళు త్రిప్పి పంపలేదు కదా అని సంతోషించినా, నా మొదటి కథ పని యింత అస్తవ్యస్తమైనందుకు ఏడుపొచ్చింది.

"ఛీ....ఏడుస్తున్నావా ? ఎందుకు ?" ఎప్పుడూ లేనిది అన్నయ్య ప్రేమగా వచ్చి తల నిమిరాడు.

"నా చెల్లి రచయిత్రి అయిందంటే నాకెంత గర్వం ? ఎంత సంతోషం ? నీ కథ చదివి, ఏమైనా తప్పులుంటే సరిచేసి నేనే పంపిస్తాను...."

సంతోషంగా, కృతజ్ఞతగా అన్నయ్య వైపు చూశాను.

— మా. నీలమణి